సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం, 12, ఆగస్టు, 2023



మోహినికుంట వాసుల స్టడీ టూర్

ముస్తాబాద్(సిరిసిల్ల): మోహినికుంట గ్రామస్తులు సర్పంచ్ కె.వనజ ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి జిల్లా అంకోల్‌లోని సోలార్ విద్యుత్ వ్యవస్థను పరిశీలించేందుకు వెళ్లారు.



సెస్ చైర్మన్‌కు సన్మానం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లిలో సెస్ మండల ఆఫీస్‌ను శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా చైర్మన్ చిక్కాల రామారావును నాయకులు సన్మానించారు.

గరిష్టం/కనిష్టం
33.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నర్సయ్య



సిరిసిల్ల: రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా కోనరావుపేటకు చెందిన బండ నర్సయ్య నియమితులయ్యారు. ఈమేరకు నియామకపత్రాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అందజేశారు. ప్రస్తుతం కోనరావుపేట పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. కొలనూర్ పీఏసీఎస్ చైర్మన్ సుంకినేని రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఉన్నతవిద్యను సద్వినియోగం చేసుకోవాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో అందుబాటులోకి వచ్చిన డిగ్రీ ఉన్నత విద్యను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు కోరారు. డిగ్రీలో శుక్రవారం ముగ్గురు విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోగా.. మొత్తం ప్రవేశాల సంఖ్య పదికి చేరింది. లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఇంతకాలం డిగ్రీ విద్య అందుబాటులో లేక కొందరు దూర ప్రాంతాలకు వెళ్లలేక ఉన్నత విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ పందిర్ల నాగరాణి, ఎలగందుల అనసూయ, నాయకులు నర్సింలు, దేవరాజు, అప్సరా ఉన్నీసా, నర్సింహారెడ్డి, డీవోఎస్టీ కో–ఆర్డినేటర్ రాజేశ్ పాల్గొన్నారు.

ఆశవర్కర్ కుటుంబానికి అండగా ఉంటాం



ముస్తాబాద్(సిరిసిల్ల): గుండెపోటుతో మృతి చెందిన మండలంలోని మొర్రాపూర్‌కు చెందిన ఆశవర్కర్ దండు పద్మ కుటుంబానికి అండగా ఉంటామని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు పేర్కొన్నారు. మొర్రాపూర్‌లో పద్మ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. కుటుంబంలో ఒకరికి ఆశవర్కర్‌గా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వ్యక్తిగతంగా రూ.20వేల ఆర్థికసాయం అందించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, వైద్యాధికారి గీతాంజలి, సీహెచ్‌వోలు లింగం, యాదగిరి, సూపర్‌వైజర్ ప్రసాద్, ఎంఎల్ హెచ్‌పీ దివ్య, ఏఎన్ఎం ప్రమీల ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం



వేములవాడ: కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే పేదలకు న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలోని 15వ వార్డులో శుక్రవారం ప్రజలను నేరుగా కలుసుకొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తప్పకుండా కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్, 9 రకాల నిత్యావసర వస్తువులను అందజేస్తామన్నారు. సాగారం వెంకటస్వామి, కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేశ్, గెంట్యాల ప్రకాశ్, మండలోజు సందీప్, మెరుగు సత్తయ్య, సుందర్‌రెడ్డి, కాషారం చంద్రయ్య, రవి, పొలాస రాజేశం, ఎలగందుల రాజేందర్, దుంపేట నర్సయ్య పాల్గొన్నారు.

వాలీబాల్ అకాడమీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లటౌన్: రాష్ట్ర వాలీబాల్ అకాడమీ సిరిసిల్ల మినీ స్టేడియంలో ప్రవేశానికి 14 నుంచి 16 ఏళ్ల వయసు గల బాలుర నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ.రాందాస్ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2007 ఆగస్టు 1 నుంచి 2009 ఆగస్టు 1 మధ్య జన్మించి, ఎత్తు 182 సెం.మీ. ఆపైన ఉండాలన్నారు. బర్త్, ఎడ్యుకేషనల్, స్పోర్ట్స్ అచీవ్‌మెంట్ సర్టిఫికెట్స్(ఒరిజినల్, జిరాక్సు) ఆధార్‌కార్డుతోపాటు 6 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 19 సిరిసిల్ల మినీ స్టేడియంలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. టీషర్ట్, నిక్కర్, షూస్ వేసుకొని రావాలని, వివరాలకు 94402 39783లో సంప్రదించాలని సూచించారు.



అంధకారంలో చిన్నబోనాల



శాత్రాజుపల్లిలో రోడ్డు ఇలా..



తిప్పాపూర్‌లో మంచినీటి కోసం ఇంటి ముందు బకెట్ల క్యూ..

విలీనం.. విలాపం

- సమస్యల నిలయాలుగా శివారుకాలనీలు
- మున్సిపాలిటీల్లో చేరి అవస్థలు
- డ్రెయినేజీలు లేక కంపుకొడుతున్న పరిసరాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



రాజీవ్‌నగర్ ఇండ్ల మధ్య మురుగు

సిరిసిల్లఅర్బన్/వేములవాడఅర్బన్: సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఇటీవల విలీనం చేసిన గ్రామాల్లో అసౌకర్యాలు కనిపిస్తున్నాయి. ఎటూ చూసిన రోడ్లపై పారుతున్న మురికినీరు.. బురదరోడ్లు.. ఖాళీ ప్లాట్లలో చేరిన పందులతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. శివారుకాలనీల్లో కనీసం పక్కా డ్రెయినేజీలు లేక.. వీధిలైట్లు వెలుగక రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సరఫరా సైతం సక్రమంగా కాకపోవడంతో ప్రజలు మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విలీన గ్రామాలపై శీతకన్ను

- సిరిసిల్ల మున్సిపాలిటీలో ఏడు గ్రామాలు రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూరు, సర్దాపూర్ గ్రామాలను విలీనం చేశారు. విలీనం చేసి ఏళ్లు గడుస్తున్నా పూర్తి స్థాయిలో వసతులు దరి చేరలేవు. ఏ గ్రామానికి వెళ్లినా అసంపూర్తి రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి వ్యవస్థ, విద్యుత్ దీపాలు లేక వెలవెలబోతుతున్నాయి.
- అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే చిత్తడవుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురుగు రోడ్డుపై పారుతుంది. పన్నుల పెరిగినప్పటికీ వసతులు సమకూర్చకపోవడంప ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- వేములవాడ మున్సిపల్ విలీన గ్రామాల్లో అభివృద్ధి లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో మురికి కాలువలు లేక ఇంటి పక్కన మురికి నీరు ఆగి దోమలతో జ్వరాలు వస్తున్నాయి. సీసీ రోడ్లు లేక వర్షానికి మట్టి రోడ్లు బురదమయంగా మారుతున్నాయి.
- వేములవాడ మున్సిపల్ విలీన గ్రామం శాత్రాజుపల్లిలోని మొదటివార్డులో మసీదుకాలనీలో సీసీ రోడ్డు లేదు. వర్షానికి నీరు నిలవడంతో స్థానికులు సొంత ఖర్చుతో మొరం పోయించుకున్నారు. డ్రెయినేజీలు, కరెంట్ పోల్స్ కనిపించడం లేదు.
- తిప్పాపూర్‌లో గత 15 రోజులుగా నల్లా నీరు రావడం లేదు. వాటర్‌ట్యాంక్‌కు వెళ్లే మిషన్‌భగీరథ నీరు పైపులైన్ పగిలిపోయింది. మూలవాగులోని మంచినీటి బావిలోకి వర్షం నీరు, చెత్తాచెదారం చేరడంతో నీటి సరఫరాను నిలిపివేశారు. రెండు రోజులకోసారి వాటర్ ట్యాంకర్ రావడంతో చాలీచాలక ఇబ్బందులు పడుతున్నారు.
- నాంపల్లిలోని మెయిన్‌రోడ్డును ఆనుకుని డ్రెయినేజీ లేక మురికినీరు రోడ్డుపై పారుతోంది. ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సీసీరోడ్లు లేవు. రాత్రి వేళ విద్యుత్ దీపాలు వెలగడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి నోచుకోవడం లేదు



సిరిసిల్ల మున్సిపాలిటీలో ఏడు గ్రామాలు విలీనమై ఏళ్లు గడుస్తున్నా పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదు. అసలు నిధులు వెచ్చిస్తున్నారో, లేదో తెలియని పరిస్థితి. గ్రామపంచాయతీలుగా ఉన్నప్పుడే, గ్రామాభివృద్ధికి సభలు పెట్టి అందరి నిర్ణయం మేరకు అభివృద్ధి పనులు జరిగేవి. ఇప్పుడు ఏవి లేవు.

– మంగ కిరణ్, పెద్దూరు

పక్షపాతం చూపిస్తున్నారు



విలీన గ్రామాలపై ప్రభుత్వం పక్షపాతం చూపిస్తోంది. అరకొర నిధులతో గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి నోచుకోవడం లేదు. ప్రతి గ్రామంలో అసంపూర్తిగా డ్రెయినేజీ, రోడ్లు కనిపిస్తున్నాయి. కనీసం వీధి దీపాలు కూడా సరిచేయడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా విలీన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– బొల్గం నాగరాజ్, 10వ వార్డు కౌన్సిలర్

నల్లా నీరు అందించాలి



తిప్పాపూర్‌లో నల్లా నీరు రాక 15 రోజులు అవుతుంది. రెండు రోజులకోసారి వాటర్‌ట్యాంకర్ వస్తే నీరు చాలడం లేదు. అధికారులు స్పందించి మంచినీరు సరిగ్గా సరఫరా చేయాలి.

– రాజమణి. తిప్పాపూర్

సీసీరోడ్డు వేయాలి



శాత్రాజుపల్లి మొదటివార్డు కాలనీలో సీసీరోడ్డు లేక వర్షానికి నీరు ఆగి నడవలేని పరిస్థితి ఉంది. నా సొంత ఖర్చుతో ట్రాక్టర్లతో మట్టి పోయించాను. అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని సీసీ రోడ్డు వేయాలి.

– నవీన్, శాత్రాజుపల్లి

అంతా ఓపెన్



కలెక్టరేట్ నుంచి సిరిసిల్ల వెళ్లే ప్రధాన మార్గంలో చంద్రంపేట ఎక్స్‌రోడ్డు వద్ద బెల్టుషాపు

- రోడ్లపక్కనే బెల్టుషాపులు
- పట్టించుకోని పోలీసులు



చంద్రంపేట బెల్టుషాపులో అక్రమ సిట్టింగ్

సిరిసిల్లక్రైం: జిల్లాలోని పల్లె, పట్టణం అనే తేడా లేకుండా మద్యం ఏరులై పారుతోంది. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో నివాసాల మధ్య వైన్‌షాపులు ఉండగా.. వాటి పక్కనే సిట్టింగ్‌రూమ్‌ల వద్ద మందుబాబుల వీరంగం అంతా.. ఇంతా కాదు. వైన్‌షాపులు, బార్‌అండ్ రెస్టారెంట్లే కాకుండా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అనధికారికంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా బార్‌లను తలపించేలా సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి మందు సప్లయ్ చేస్తున్నారు. సాయంత్రం అయ్యిందంటే అటు వైపు నుంచి వివిధ పనుల కోసం వెళ్లే మహిళలు భయాందోళన చెందుతున్నారు. ట్యూషన్‌లకు వెళ్లే విద్యార్థినుల కష్టాలు చెప్పలేనివిగా ఉన్నాయి.

జోరుగా బెల్టుషాపులు

- ఒక్కో ఊరిలో కనీసం ఐదు నుంచి ఎనిమిది బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. చాలా గ్రామాల్లో కిరాణాషాపుల్లోనూ మద్యం విక్రయాలు జరుపుతున్నారు.
- సిరిసిల్ల, వేములవాడ శివారు ప్రాంతాల్లోని మైదానాల్లో మద్యం సిట్టింగ్‌లు పెరగడంతో వ్యవసాయ పనుల కోసం పొలాల వద్దకు వెళ్లిన మహిళలు సాయంత్రం వేళ ఒంటరిగా ఇంటికొచ్చేందుకు జంకుతున్నారు.
- వేములవాడలో రాజన్న చెరువు పరిసర ప్రాంతాల్లో చీకటి పడితే చాలు మద్యంబాబులు హల్‌చల్ చేస్తున్నారు.
- సిరిసిల్ల బైపాస్‌రోడ్డు, జూనియర్ కాలేజీ గ్రౌండ్, విద్యానగర్ పంపుహౌస్, అంభబాయి గుడి వెనుక ప్రాంతం, వైకుంఠధామం, చంద్రంపేట నుంచి వెళ్లే దారిలోని గ్రౌండ్, సుందరయ్యనగర్, పెద్దబోనాల వెళ్లే మార్గం, పద్మనగర్ శివారు ప్రాంతం, ఇందిరానగర్ శివారు, పెద్దూర్ వైన్స్ ఏరియాల్లో బహిరంగ మద్యపానం షరామాములుగా మారింది.
- సిరిసిల్ల కూరగాయాల మార్కెట్, శాంతినగర్‌లో కల్లు దుకాణాలు జనావాసాల మధ్య ఉండి ఇబ్బందికరంగా మారాయి.
- సిరిసిల్ల పాతబస్టాండ్, గాంధీనగర్, కామారెడ్డి ప్రధాన రహదారి వెంట ఉన్న వైన్స్‌లకు వచ్చే మందుబాబులు వాహనాలను ఇష్టారీతిగా పార్కింగ్ చేస్తున్నారు.
- వేములవాడలో చెక్కపల్లిరోడ్డు, కోనాయిపల్లి రోడ్డు, బీఈడీ కళాశాల ఏరియా, రాజన్న గుడి పార్కింగ్ సమీపం, మల్లారంరోడ్డు, నాంపల్లి, శాంతినగర్ రియల్ వెంచర్స్, పెద్దగుడి ఏరియా, గురుకుల కళాశాల వెనక భాగం ప్రాంతాల్లో బహిరంగ మద్యపానం విచ్చలవిడిగా సాగుతోంది.

గస్తీ పెంచుతాం



జిల్లాలో బహిరంగ మద్యపానం నిషేధం. ఎవరూ పట్టుబడిన చట్టపరిధిలో కేసు నమోదు చేస్తాం. జరిమానాలు విధిస్తాం. బహిరంగ మద్యపానం ఉండే ఏరియాల గురించే చెబితే రోజువారీ గస్తీ పెంచుతాం. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం. ప్రజలు సహకరిస్తే శాంతియుత వాతావరణం నెలకొంటుంది.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

స్వచ్ఛ గ్రామీణ సర్వేక్షణ్ పూర్తి



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

సిరిసిల్లటౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023లో భాగంగా జిల్లాలో పర్యటించిన స్వచ్ఛ సర్వేక్షన్ బృందంతో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ శుక్రవారం సమీక్షించారు. జిల్లాలో 20 గ్రామాలను నాలుగు రోజులపాటు స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం తనిఖీ చేసిందని తెలిపారు. గ్రామాల్లో ఓడీఎస్ ప్లస్‌లో భాగంగా చేపట్టిన పనులు, తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్ట్ షెడ్ నిర్వహణ, మరుగుదొడ్డి సౌకర్యం, మురుగునీటి పారుదల నిర్వహణ, కిచెన్‌గార్డెన్, ఇంకుడుగుంతలు, పారిశుధ్యం పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులకు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ బృందం సభ్యులు శ్రీనివాస్, సాయి, ఆయాజ్, ప్రవళిక, వినీత, నరేంద్ర, జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, ఏపీడీ నర్సింహులు, ఏపీవో పాపారావు ఉన్నారు.

కలవరపెడుతున్న కండ్ల కలక

- విద్యార్థులపై తీవ్ర ప్రభావం
- విస్తృతంగా వ్యాప్తి
- అజాగ్రత్తతో కంటిచూపునకు ప్రమాదం
- ఐసోలేషన్ చేయాలంటున్న వైద్యులు



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు

సిరిసిల్లఎడ్యుకేషన్: కండ్లకలక కలవర పెడుతోంది. ఇటీవల జిల్లాలో కండ్ల కలక కేసులు పెరగడమే ఇందుకు నిదర్శనం. ఒకరి నుంచి ఇంకొకరి వేగంగా వ్యాప్తి చెందుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పాఠశాలల్లో పిల్లలు ఒక్క చోటే కూర్చుంటుండడంతో కండ్ల కలక బ్యాక్టీరియా వేగంగా వ్యాప్తి చెందుతోంది. వారం రోజులుగా కేసులు ఎక్కువగా నమోదవుతుండడంతో జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 20 శాతం తగ్గినట్లు తెలిసింది.

విభిన్న కారణాలు

కండ్ల కలక రావడానికి విభిన్న కారణాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. వైరస్‌తో వచ్చే కండ్ల కలక కొద్ది రోజులుండి తగ్గుతోందని చెబుతున్నారు. కానీ ఇలా వచ్చిన దానిలో కన్ను నొప్పి ఉండడానికి తాత్కాలిక ఉపశమనానికి చుక్కలమందులు వాడడం మంచిదంటున్నారు. బ్యాక్టీరియతో వచ్చే కంటికలక ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. బ్యాక్టీరియా ప్రభావం ఎక్కువగా ఉంటే కంటిచూపు పోయే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏదేమైనా కండ్ల కలకతో బాధపడే సొంతం వైద్యం పాటించకుండా వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు ఇవీ..

- కళ్లు ఎర్రగా మారడం, మంట, నొప్పి, దురద, కనురెప్పలు వాపు రావడం, కంటిరెప్పలు అతుక్కుపోవడం, పొద్దున లేచేసరికి ఎక్కువ ఊసులతో కనురెప్పలు అతుక్కొని ఉండడం కనిపిస్తుంది.
- ఎక్కువ వెలుగు చూడలేకపోవడం, కళ్ల నుంచి నీరు లేక చిక్కటి ద్రవం కారడం, బ్యాక్టీరియాతో కలిగిన కండ్ల కలకలో చీము వచ్చే అవకాశం ఉంటుంది. ఆ ఇన్ఫెక్షన్ కనుగుడ్డులో వ్యాప్తి చెందితే చూపు పోయే ప్రమాదం ఉంది.

అజాగ్రత్తతో కంటిచూపునకు ప్రమాదం

ప్రస్తుతం చాలా మందికి కండ్ల కలక వస్తుంది. పిల్లలపై ప్రభావం అధికంగా ఉంది. కండ్ల కలక రాగానే వైద్యులను సంప్రదించాలి. ఇష్టారీతిగా చుక్కల మందులు వాడితే కంటి చూపు పోయే ప్రమాదం ఉంది. వైరస్, బ్యాక్టీరియా, కెమికల్స్, అలర్జీ వంటి విభిన్న రీతిలో కండ్ల కలక వస్తుంది. ఐసోలేషన్ పాటిస్తే మిగతా వారికి వ్యాపించకుండా నివారించవచ్చు. – సురేంద్రబాబు, పిల్లల వైద్యనిపుణులు, సిరిసిల్ల

నివారణకు ఇవి పాటించాలి

- కంటిని తరచూ మంచినీళ్లతో కడుక్కోవాలి.
- మిగతా వారికి దూరంగా ఉండాలి.
- వ్యక్తిగత శుభ్రతను పాటించాలి.
- కళ్లు దురదగా అనిపిస్తే పదే పదే రుద్దకూడదు.
- చేతులు తరచూ సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- కళ్లద్దాలు వాడడం ద్వారా ఇన్ఫెక్షన్స్ వ్యాప్తిని అడ్డుకోవచ్చు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

- డీఎస్పీ నాగేంద్రచారి



పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

రుద్రంగి(వేములవాడ): కొత్త వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని డీఎస్పీ నాగేంద్రచారి కోరారు. రుద్రంగిలోని ఒడ్డెర కాలనీలో శుక్రవారం కార్డన్‌సెర్చ్ చేపట్టారు. 30 ద్విచక్రవాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గొల్లం రెడ్డి ఇంట్లో వన్యప్రాణుల వేటకు వినియోగించే వలను స్వాధీనం చేసుకుని, అతన్ని బైండోవర్ చేశారు. డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమన్నారు. అటవీలో విద్యుత్‌తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడే వారిని పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైతే 1930, డయల్ 100లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఐ కిరణ్‌కుమార్, ఎస్సైలు రాజేశ్, అశోక్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న మద్యం దరఖాస్తులు

- 439 టెండర్లు స్వీకరణ
- ప్రభుత్వ ఖజానాకు రూ.8.78 కోట్లు

సిరిసిల్లక్రైం: జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల దాఖలు ఊపందుకుంది. రోజుకు వందకు పైగా దరఖాస్తులు వస్తున్నట్లు జిల్లా ఆబ్కారీ అధికారి పంచాక్షరీ తెలిపారు. శుక్రవారం శుభ సూచకంగా 164 మంది టెండర్ ఫారాలు అందచేసినట్లు తెలిపారు. జిల్లాలోని 48 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 439 దరఖాస్తులు రాగా.. రాష్ట్ర ఖజానాకు రూ.8.78 కోట్ల ఆదాయం సమకూరింది. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 18 వరకు అవకాశం ఉంది. సిరిసిల్లలోని వైన్స్‌కు 281 దరఖాస్తులు, వేములవాడ సర్కిల్‌లోని వైన్స్‌కు 80, ఎల్లారెడ్డిపేట సర్కిల్‌లోని వైన్స్‌కు 78 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

చిన్నారికి పెద్ద కష్టం

- 18 నెలలకే మూత్రపిండాల వ్యాధితో ఇబ్బంది
- కూతురుకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకోలు



తల్లిదండ్రులతో చిన్నారి భవాని

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఆడుతూ..పాడుతూ కళ్ల ముందు బుడిబుడి అడుగులతో సరదాగా గడుపుతున్న ఆ చిన్నారికి పెద్ద కష్టం వచ్చింది. తల్లిదండ్రులకు ఆలస్యంగా పుట్టిన సంతానం కావడంతో వారు ఆ చిన్నారిని అపురూపంగా చూసుకుంటూ మురిసిపోతున్నారు. ఈక్రమంలోనే చిన్నారికి పెద్ద కష్టం రావడంతో ఆ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన మరాఠి పద్మ–మల్లయ్య దంపతులకు భవాని(18 నెలలు) కూతురు ఉంది. కొద్ది రోజులుగా అనారోగ్యంగా ఉంటున్న చిన్నారిని తల్లిదండ్రులు గురువారం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో చూపించారు. పరీక్షించిన వైద్యులు భవాని మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. చిన్న వయస్సులోనే ఇంత పెద్ద కష్టం రావడంతో ఆ దంపతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మూత్రపిండాల వ్యాధి నయం కావడానికి రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దినసరి కూలీ పనులు చేసుకునే వారికి చేతిలో చిల్లి గవ్వలేక ఆవేదనతో దిక్కులు చూస్తున్నారు. దాతలు స్పందించి తమ కూతురుకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు. దయాహృదయులు ఫోన్ పే నంబర్ 95429 13519(మరాఠి మల్లయ్య)కు సాయం అందించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

రాజన్న సేవలో ఎస్సై ఎంపిక అభ్యర్థి



వేములవాడ: ఎస్సై ఉద్యోగానికి ఎంపికైన కొప్పుల స్వాతి శుక్రవారం తన కుటుంబసభ్యులతో కలిసి వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించారు.

అన్నదానం

రాజన్న ఆలయ పరిసరాల్లోని పేదలకు ఆలయ అర్చకుడు చంద్రగిరి శరత్‌శర్మ శుక్రవారం అన్నదానం చేశారు. మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలోనూ అన్నదానం చేపట్టారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

వేములవాడ: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లికి చెందిన గుడిసె నరేశ్ గుండెజబ్బుతో బాధ పడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం బాధితుడి ఇంటికి వెళ్లి, అతని భార్య కవితకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు మధు మహేశ్, గొంగళ్ల రవికుమార్, బెజ్జంకి రవీందర్, పాత సంతోష్, పాలాస రాజేందర్, నక్క వేణు పాల్గొన్నారు.

సిరిసిల్లలో బైక్ దహనం

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన



సిరిసిల్లక్రైం: గుర్తు తెలియని వ్యక్తులు ఓ బైక్‌ను దహనం చేసిన ఘటన సిరిసిల్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని దోబిగల్లీకి చెందిన రమేశ్ ఆటో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. రోజువారీగా బుధవారం తన పని ముగించుకొని, ఇంటి ఎదుట బైక్ నిలిపి, లోపలికి వెళ్లాడు. కొద్దిసేపటికి బయటకు రాగా వాహనంపై మంటలు కనిపించాయి. వాటిని ఆర్పివేశాడు. బైక్ కాలిపోయింది. నిప్పు పెట్టిన వ్యక్తులు అప్పటికే పారిపోయారు. చుట్టుపక్కల వారిని అడిగినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రమేశ్ తెలిపాడు.

మహిళ ఆత్మహత్య



విజయ (ఫైల్)

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లికి చెందిన దాసరి విజయ(40) ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. విజయ–శంకర్ దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. శంకర్ పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటినుంచి విజయ కూలి పని చేస్తూ పిల్లలను పోషిస్తోంది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం చేను వద్ద చెట్టుకు ఉరేసుకుంది. మృతురాలి కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజిరెడ్డి తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కౌలు.. కష్టాలు

ఏటా పెరుగుతున్న కౌలు ధరలు



వరి నాటు వేస్తున్న కూలీలు

- ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల ఖర్చు
- రైతుబంధు వచ్చినా కౌలు తగ్గని వైనం
- ఇబ్బందుల్లో కౌలు రైతులు

గంభీరావుపేట(సిరిసిల్ల): భూ యజమానులకు రైతుబంధు వచ్చినా.. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండినా.. పండకపోయినా కౌలు ధరలు మాత్రం ఏటా పెరుగుతూనే ఉన్నాయి. సాగుపైనే ఆధారపడిన కౌలురైతులు పెరిగిన ధరలకనుగుణంగా కౌలు చెల్లించాల్సి వస్తోంది. ఈ ఏడాది కాకపోయినా మరో ఏడాదైనా దిగుబడులు వస్తాయనే ఆశతో భూమిని కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నారు. మరోవైపు కౌలురైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాలో దాదాపు 30వేల మంది కౌలురైతులు ఉంటారని అంచనా. వానాకాలం సాగుకోసం కౌలురైతులు భూయజమానుల దగ్గర కౌలు మాట్లాడుకొని సాగుపనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో కౌలు ధర ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు నడుస్తోంది. దిగుబడి వచ్చినా.. రాకపోయినా.. భూయజమానికి ప్రభుత్వం అందించే రైతుబంధు అందుతున్నప్పటికీ కౌలుధరలు మాత్రం తగ్గడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా కౌలు రైతులకు నయా పైసా రావడం లేదు. చివరికి కౌలు రైతులకు పంట రుణాలు కూడా అందని పరిస్థితి. దీంతో కౌలు రైతులు పంటల సాగు కోసం ప్రైవేటుగానే అప్పులు చేస్తున్నారు. చివరికి కౌలురైతులు నష్టాలనే భరిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కౌలురైతుల కష్టాలను గుర్తించి వారి సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పంట రుణాలు అందించాలి



వేరే వాళ్ల భూములను తీసుకొని కౌలు చేసుకునే రైతులకు ప్రభుత్వం క్రాప్ లోన్లు అందించాలి. నేను నాలుగైదు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాను. ఏటా పంటలకు చీడపీడలు ఆశించి నష్టపోతున్నాం. పెట్టుబడులు వచ్చే పరిస్థితులు లేవు.

– మేడిపల్లి శంకరయ్య, కౌలురైతు, గంభీరావుపేట

కౌలు రైతులను ఆదుకోవాలి



కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. కౌలు ధరలను నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఏటా కౌలుధరలు పెరిగిపోతున్నాయి. ఎలాంటి భూమి లేకున్నా కౌలు సాగు చేసుకుంటున్న రైతులకు కూడా ప్రభుత్వం రైతుబంధు అందించి ఆదుకోవాలి.

– దాసరి చంద్రం, కౌలు రైతు, నర్మాల

ఎన్సీడీ కిట్లు సద్వినియోగం చేసుకోవాలి



పేషెంట్ల వివరాలు అడుగుతున్న డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు

- సులువుగా మందులు వాడుకోవచ్చు
- డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు

చందుర్తి(వేములవాడ): దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అందించే ఎన్సీడీ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు కోరారు. చందుర్తి మండలం కట్టలింగంపేట, కొత్తపేట, రామన్నపేటల్లో ఎన్సీడీ కార్యక్రమంలో భాగంగా షుగర్, బీపీలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు మాట్లాడుతూ గ్రామీణులకు దీర్ఘకాలిక వ్యాధులు డయాబెటిక్, రక్తపోటు వ్యాధులకు ప్రతీ నెల ఉచితంగా మందులు పంపిస్తున్నట్లు తెలిపారు. ఎన్సీడీ కిట్ల ద్వారా సులువుగా మందులు వాడుకునే అవకాశం ఉంటుందన్నారు. సర్పంచులు ఏనుగుల జమున, పిట్టల లాస్య, దుమ్ము అంజయ్య, చందుర్తి పీహెచ్‌సీ సంపత్, వైద్యసిబ్బంది ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని హన్మాజిపేట, మల్లారం గ్రామాల్లో డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు తనిఖీలు చేపట్టారు. షుగర్, బీపీరోగులు వాడుతున్న గోలీల గురించి తెలుసుకున్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ రజిత, హన్మాజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి దివ్య ఉన్నారు.

వెట్టిచాకిరీ చేస్తున్నం.. పర్మినెంట్ చేయండి

- రాజన్న ఆలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

వేములవాడ: ఏళ్లుగా చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరీ చేస్తున్నాం.. ప్రభుత్వంతో మాట్లాడి, తమను పర్మినెంట్ చేయాలని రాజన్న ఆలయంలో పని చేస్తున్న 235 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే రమేశ్‌బాబును కలిసి, వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కమిషనర్ అనిల్‌కుమార్‌లతో మాట్లాడి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్ నాయకుల్లో ఓటమి భయం

- ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరపాలి
- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: రాబోయే శాసనసభ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గానికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ఎలక్షన్ జరపాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్ కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుల్లో ఓటమి భయం మొదలైందని, అందుకే పదే పదే ప్రతిపక్షాలపై అవాక్కులు, చవాకులు పేలుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్ వాళ్లు మద్యం, డబ్బులు విచ్చలవిడిగా పంచుతున్నారని, ఇప్పుడు కూడా పంచేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ మద్యం, డబ్బులు పంచనని చెప్పారు కదా.. సిరిసిల్లలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిపించి, తన చిత్తశుద్ధి చాటుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, టౌన్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 4 తులాల బంగారం అపహరణ



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న సీఐ సదన్‌కుమార్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రంలో దొంగలు రెచ్చిపోయారు. తాళం వేసిన ఇంటిలో చొరబడి బీరువా తలుపులు పగులగొట్టి నాలుగు తులాల బంగారం, ఒక ట్యాబ్ ఎత్తుకెళ్లారు. మండల కేంద్రానికి చెందిన మ్యాన లత గురువారం రాత్రి తన ఇంటికి తాళం వేసి నిద్రించేందుకు తన అత్తవాళ్ల ఇంటికెళ్లింది. శుక్రవారం తిరిగొచ్చేసరికి తాళం పగులగొట్టి కనిపించింది. తలుపులు తెరిచి ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువా పగులగొట్టి వస్తువులన్ని చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిన నాలుగు తులాల బంగారంతోపాటు మహిళా సంఘానికి చెందిన ట్యాబ్ చోరీకి గురైనట్లు గుర్తించింది. పోలీసులకు సమాచారం అందించడంతో డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్ వచ్చి పరిశీలించారు. శుక్రవారం రాత్రి సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్ దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- ఒకరికి గాయాలు

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల కొండా లక్ష్మణ్‌బాపూజీ జంక్షన్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఓ లారీ ఢీకొట్టింది. స్థానికుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి వస్తున్న లారీ సిరిసిల్లలో జంక్షన్ మలుపు వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం పూర్తిగా దెబ్బతినగా దానిపై ఉన్న మల్లేశం గాయపడ్డాడు. స్థానికులు బాధితుడిని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుతో రైతు మృతి



ఎల్లయ్య (ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని బరిగెలగూడెం కాలనీకి చెందిన బరిగెల ఎల్లయ్య (45) అనే రైతు పాము కాటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లయ్య గురువారం తన పొలానికి నీరు పెట్టడానికి వెళ్లి, తిరిగి వస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య లత, కూతురు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాలనీవాసులు కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



వెంకటేశం (ఫైల్)

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన గడ్డం వెంకటేశం(31) మానేరు వాగులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి వివరాల ప్రకారం.. వెంకటేశం కుటుంబ అవసరాల నిమిత్తం ఆటో నడుతున్నాడు. గత సోమవారం కూడా నడిపి, రాత్రి ఇంటికి వస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు ఆటో ఓ బైక్‌కు తగిలింది. దీంతో కొందరు యువకులు వెంకటేశంను కొట్టారు. అతని అడ్రస్ తీసుకొని తెల్లవారు జామున ఇంటికి వచ్చి, బెదిరించారు. వెంకటేశం మంగళవారం ఆటో తీసుకొని, బయటకు వెళ్లాడు, కానీ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మానేరు వాగులో ఓ యువకుడి మృతదేహం ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరిగింది. విషయం తెలుసుకున్న వెంకటేశం కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడు శవమై కనిపించడంతో వెంకటేశం తల్లి లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపించింది. బైక్ విషయంలో గొడవ పడినవారే చంపేశారని ఆరోపించింది. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు. ఆటో ఎక్కడున్న విషయం ఇంకా తెలియలేదు.

కాలువలో పడి ఛత్తీస్‌గఢ్‌వాసి గల్లంతు

హుజూరాబాద్ రూరల్: హుజూరాబాద్ పట్టణ శివారులోని గాంధీనగర్ సమీపంలో గల ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో పడి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి గల్లంతయినట్లు స్థానికులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని భీమతార జిల్లా తనకహమియా గ్రామానికి చెందిన నేతం దిలీప్ జీవనోపాధి నిమిత్తం తన భార్య ఉత్తర, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లతో కలిసి కొన్ని నెలల క్రితం హుజూరాబాద్ వచ్చి, గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతను మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లిన దిలీప్ ప్రమాదవశాత్తు ఎస్సాఎస్పీ కాల్వలో పడి, కొట్టుకుపోయాడు. ఆ సమయంలో అతని కుమారుడు రోషన్, భార్య ఉత్తర అక్కడే ఉన్నారు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో కొంత దూరం వెళ్లి, పలువురిని తీసుకువచ్చేలోపే నీటిలో మునిగి, గల్లంతయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దిలీప్ కోసం గాలిస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

వేములవాడలో ‘స్టార్’ సౌలత్‌లు



కోనాయపల్లి రోడ్డులో రూపుదిద్దుకుంటున్న రిసార్ట్



స్టార్ హోటల్ తరహాలో నిర్మించిన భవనం

- రాజన్న భక్తుల కోసం హోటల్, రిసార్ట్‌ల నిర్మాణం
- అన్ని రకాల వసతులు కల్పిస్తున్న నిర్వాహకులు

వేములవాడ: దక్షిణకాశీగా పేరు గాంచిన వేములవాడలో స్టార్ హోటల్ తరహాలో హోటల్ నిర్మించారు. రిసార్ట్ పనులు తుది దశలో ఉన్నాయి. స్థానిక రాజరాజేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రస్తుత జనరేషన్‌కు తగినట్లు వసతులు, ప్రపంచవ్యాప్తంగా వేములవాడ విశిష్టతను చాటిచెప్పేందుకు ఆన్‌లైన్‌లో బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని పంచేందుకు చొరవ తీసుకుంటున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. వేములవాడ పట్టణం కోనాయపల్లి రోడ్డులోని భీమేశ్వర గార్డెన్ వద్ద పచ్చని పొలాల మధ్య 4 గదులతో రిసార్ట్ రూపుదిద్దుకుంటోంది. ముందు స్విమ్మింగ్ పూల్, చుట్టూ రక్షణ గోడ, సీసీ కెమెరాలు ఇతర సౌలత్‌లు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. రాజన్న గుడికి కూతవేటు దూరంలో స్టార్ హోటల్ తరహాలో భవనం నిర్మించారు. ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం కల్పించారు. భక్తులు ఇష్టమైనన్ని రోజులు ఉండేలా ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ కోతలతో రైతులకు తిప్పలు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



లాగ్‌బుక్కు పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల నియోజకవర్గంలోనూ వ్యవసాయానికి విద్యుత్‌కోతలు తప్పడం లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి విమర్శించారు. ఎల్లారెడ్డిపేటలోని 33/11 కేవీ విద్యుత్‌సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్కును శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ పోరాటాలతో కొద్ది రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా చేసినప్పటికీ మళ్లీ గత మూడు రోజులుగా విద్యుత్ కోతలు విధిస్తున్నారన్నారు. మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో చెప్పినట్లుగా 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ సరఫరా క్షేత్రస్థాయిలో ఎక్కడ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గంట బుచ్చాగౌడ్, చెన్నిబాబు, కొత్తపల్లి దేవయ్య, చెరుకు ఎల్లయ్య, హుస్సేన్, బాలయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్



వెంకట్రావుపల్లి స్కూల్లో సభ్యత్వం ఇస్తున్న శ్రీనివాస్

బోయినపల్లి(చొప్పదండి): విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం బోయినపల్లి మండలంలోని పలు హైస్కూళ్లలో తపస్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు, 3 డీఏలను విడుదల చేయాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి జగన్‌మోహన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలన్నారు. పీఈటీల ఉన్నతీకరణ, ఐఆర్‌లపై ప్రకటన చేయాలని, పీఆర్సీ వేసి, 317 జీవోతో స్థానికత కోల్పోయిన వారికి సొంత జిల్లాల్లో అవకాశం కల్పించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. మోడల్ స్కూల్, గిరిజన, కేజీబీవీ టీచర్ల సమస్యలు తీర్చాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న మహాధర్నా చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకట్రావు, పూరెల్ల రవికుమార్, అన్నాడి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు



దురుసుగా ప్రవర్తిస్తున్న విజయ్‌సాగర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవరాజు విధులకు ఆటంకం కలిగించి, ఆయనను నెట్టివేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సెకండ్ బైపాస్‌లో గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన నర్ర విజయ్‌సాగర్‌రెడ్డి ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. గ్రామ పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయిస్తున్నాడు. ఈ విషయమై కార్యదర్శి అతనికి పలుమార్లు నోటీసులు జారీ చేశారు. అయినా స్పందించకుండా నిర్మాణం చేస్తుండటంతో ఆయన తన సిబ్బందితో శుక్రవారం అక్కడికి వెళ్లి, సామగ్రి తొలగిస్తున్నారు. దీంతో విజయ్‌సాగర్‌రెడ్డి జీపీ కార్యదర్శి, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడు. తన విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా నెట్టివేశాడని కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన



కేంద్ర బృందానికి స్వాగతం పలుకుతున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని అనుపురంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది. గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత, తడి, పొడి చెత్త సేకరణ, శ్మశానవాటిక నిర్వహణ తదితర అంశాలపై వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, సర్పంచు కొండపల్లి వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుల ఎంపికలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, రాజన్నపేట, కోరుట్లపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. గ్రామంలో చెత్తసేకరణ, పచ్చదనం–పరిశుభ్రత, శ్మశానవాటిక, డంప్‌యార్డులు, మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల వినియోగం, వాటి స్థితిగతులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు గురించి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. టీం లీడర్ శ్రీనివాస్, సభ్యులు సాయి, ఆయాజ్, వినీత, ఎంపీడీవో చిరంజీవి, సర్పంచులు కొండాపురం బాల్‌రెడ్డి, ముక్క శంకర్, దేవానందం, ఎంపీవో వజీర్, ఏపీవో కొమురయ్య ఉన్నారు.

నిరుపేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న సుధాకర్

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన వ్యాపారి తన పెద్ద కొడుకు–కోడలు పెళ్లి రోజు సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా నిరుపేద విద్యార్థులకు సైకిళ్లు అందించారు. స్థానిక వ్యాపారి పోకల సుధాకర్ పెద్దకొడుకు–కోడలు వంశీధర్–శ్రీలత 13వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం 13 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో తిరుమల ఎలక్ట్రానిక్స్ యజమాని పోకల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

‘విభూది ధారణతో సకల శుభాలు’



మహాహారతి ఇస్తున్న లక్ష్మారెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విభూది ధారణతో సకల శుభాలు కలుగుతాయని హైదరాబాద్‌కు చెందిన త్రిగుళ్ల నరసింహమూర్తిశర్మ అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని సత్సంగ సదనంలో శుక్రవారం ప్రవచనాలు వినిపించారు. సదనం అధ్యక్షుడు బ్రహ్మాచారి లక్ష్మారెడ్డి మహాహారతినిచ్చారు. భక్తులు పాల్గొన్నారు.